
సాక్షి గ్రేటర్ వరంగల్

(హనుమకొండ - వరంగల్)

ఆదివారం 24 నవంబర్ 2024



పరీక్షలు సాగేనా..ఆగేనా? - 8లో

కేయూ పరిధిలోని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలకు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడం లేదని యాజమాన్యాలు నిరవధిక బంద్‌ను కొనసాగిస్తున్నాయి.



ఘాతుకానికి పాల్పడిన వారిని వదలం

అమాయకులను హత్య చేసిన మావోయిస్టులను వదిలి పెట్టమని ములుగు ఎస్పీ శబరీష్ అన్నారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం $28^0/15^0$

జిల్లాలో ఉదయం నుంచి వాతావరణం చలిగా ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. రాత్రి సమయంలో చలితోపాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలి



కాజీపేట రూరల్ : అర్హులైన యువతకు ఓటరుగా నమోదు చేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని (స్పెషల్ సమ్మర్ రివిజన్) ఎన్నికల అబ్జర్వర్ ఆయేషా మస్రత్ ఖానం తెలిపారు. కాజీపేట బాపూజీనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు, సవరణ కేంద్రాన్ని మస్రత్ ఖానం శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె జిల్లా అధికారులు, బూత్ లెవల్ ఆఫీసర్లతో మాట్లాడారు. కాజీపేట మండల పోలింగ్ బూత్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని ఓటరు నమోదు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆర్డీఓ రాథోడ్ రమేశ్, కాజీపేట తహసీల్దార్ బావుసింగ్, ఆర్‌ఐలు ఎం.శివ, కృష్ణ, ఆర్పీలు పద్మ, స్వరూప పాల్గొన్నారు.

వరంగల్‌లో..

వరంగల్: గిర్మాజీపేట ఉన్నత పాఠశాలలోని 10, 11, 12 పోలింగ్ బూత్‌లను ఎన్నికల అబ్జర్వర్ ఆయేషా మస్రత్ ఖానం శనివారం పరిశీలించారు. పోలింగ్ బూత్‌లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, అధికారులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట : మైనార్టీ సంక్షేమ శాఖ, స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్-2 పరీక్షకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు మాక్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి టి.రమేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీ అభ్యర్థులు (ముస్లిం, సిక్కులు, క్రిస్టియన్, బౌద్ధులు, పార్శీ, జైనులు) సుబేదారిలోని షరీఫన్ మజీద్ ఎదురుగా, అపోలో ఫార్మసీ పక్కన, రాధాకృష్ణ కిరాణంపై రెండో అంతస్తులో ఉన్న జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి కార్యాలయంలో ఈనెల 29లోగా దరఖాస్తులు అందజేయాలని కోరారు. పూర్తి వివరాలకు 0870-2980533 ఫోన్‌నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఇంటర్‌వర్సిటీ జూడో టోర్నీకి కేయూ మహిళా జట్టు



కేయూ క్యాంపస్ : భోపాల్‌లోని ఎల్ఎన్‌సీటీ యూనివర్సిటీలో జరుగుతున్న సౌత్‌వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ జూడో టోర్నీలో పాల్గొనే కాకతీయ యూనివర్సిటీ మహిళా జట్టును ఎంపిక చేసినట్లు స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య శనివారం తెలిపారు. జట్టులో కె.అనూష, డి.ప్రగతి, డి.బేబిలత, డి.నక్షత్ర (టీఎస్‌డబ్ల్యూ ఆర్డీసీ, వరంగల్ వెస్ట్), టి.చంద్రకళ, పి.నాగలక్ష్మి (టీటీడబ్ల్యూ ఆర్డీసీ, కొత్తగూడెం) ఉన్నారు. ఈ జట్టుకు టీడబ్ల్యూ ఆర్డీసీ (ఉమెన్) వరంగల్ వెస్ట్ ఫిజికల్ డైరెక్టర్‌జ్యోతి కోచ్, మేనేజర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు.

25 నుంచి 'వికసిత్ భారత్'

వరంగల్: ప్రధాని నరేంద్రమోదీతో తమ అభిప్రాయాలను ప్రత్యక్షంగా పంచుకునే గొప్ప అవకాశాన్ని ఉమ్మడి జిల్లాలోని యువత సద్వినియోగం చేసుకోవాలని నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి అన్వేశ్ చింతల ఒక ప్రకటనలో కోరారు. మేరా యువ భారత్ వేదికగా ప్రారంభంకానున్న వికసిత భారత్ చాలెంజ్‌లో యువత భాగస్వామ్యం కోసం భారత ప్రభుత్వం ఒక కొత్త వేదికను ప్రారంభించిందని పేర్కొన్నారు. 2025లో జరిగే నేషనల్ యూత్ ఫెస్టివల్ స్థానంలో 'వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్'ను ప్రారంభిస్తున్నారని తెలిపారు. ఈనెల 25 నుంచి డిసెంబర్ 5 వరకు 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్'కు సంబంధించిన www.mybharat.gov.in డిజిటల్ క్విజ్‌లో పాల్గొనాలని ఆయన సూచించారు.

లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

వరంగల్: మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి మీడియా అకాడమీ రూ.మూడు వేల చొప్పున పింఛన్ అందించనుందని వరంగల్ డీపీఆర్వో మహ్మద్ అయూబ్అలీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని జర్నలిస్టుల కుటుంబాలు 2024-25 సంవత్సరానికి సంబంధించిన లైఫ్ సర్టిఫికెట్లను జిల్లా పౌరసంబంధాల కార్యాలయంలో ఈనెల 27లోపు అందజేయాలని కోరారు.

ఆధ్యాత్మిక.. అనుబంధాల వనభోజనం

కార్తీక మాసంలో ప్రాచీన కాలం నుంచి వస్తున్న సంప్రదాయం

- వివిధ కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహణ
- ఐక్యతను చాటేలా కార్యక్రమాలు.. ఆటపాటలతో వనమంతా సందడే
- నేడు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వనభోజనాలు



కార్తీక వనభోజనాలు (ఫైల్)

సండే స్పెషల్

హన్మకొండ కల్చరల్ :

కార్తీక మాసం అనేక విశేషాల పవిత్రమైన మాసం. ఈ మాసం వచ్చిందంటే చాలు వన భోజనాల సందడి కనిపిస్తుంది. అందరూ భక్తి భావంతో పూజలు చేస్తూ సరదాగా ఆట, పాటలతో గడుపుతారు. ఉసిరి చెట్టునీడన భోజనం చేస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వివిధ కులాలు, సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వనభోజనాలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కార్తీక మాసంలో వనభోజనాల ప్రత్యేకతలపై ఈ వారం ప్రత్యేక కథనం.

వనంతోనే ఆనందం..

కార్తీక మాసం వనభోజనం అంటే ఎక్కడపడితే అక్కడ చేసే కార్యక్రమం కాదు. వనభోజనానికి ఆహ్లాదకరమైన ప్రదేశం అత్యంత పవిత్రంగా ఉండాలి. వనభోజనాలకు రకరకాల ఫల, పుష్ప, వృక్షాలు కలిగిన ఏటి ఒడ్డున ఉన్న ప్రదేశాన్ని ఎంచుకోవడం ఉత్తమం. అక్కడ తప్పనిసరిగా ఉసిరి చెట్టు ఉండాలి. తులసి వంటి మొక్కలు కూడా ఉంటే మరీ మంచిది. బయట నుంచి తెచ్చినవి కాకుండా ఆహార పదార్థాలు అక్కడే వండుకోవాలి. సాత్విక ఆహారాన్ని తీసుకోవడం మేలు. ఉసిరి చెట్టు కింద సాలగ్రామం పెట్టి కార్తీక పూజలు చేయాలి. తర్వాత విస్తరాకుల్లో గానీ అరిటాకుల్లో గానీ అందరూ కలిసి భోజనం చేయాలి. ఇలా అందరూ కలిసి పనిచేయడంలో సహకార స్ఫూర్తి మనకు కనిపిస్తుంది.

ఆరోగ్య రహస్యం..

ప్రతీ ఆధ్యాత్మిక కార్యక్రమం వెనుక ఒక ఆరోగ్య రహస్యం ఉంటుంది. ముందు శ్రావణ, భాద్రపద మాసాలు వర్ష రుతువు కావడంతో ఆ నెలల్లో కురిసిన వర్షాలకు నేల మీద ఎన్నో మొక్కలు జీవం పోసుకుని కార్తీక మాసం వచ్చేసరికి చక్కగా పెరుగుతాయి. కార్తీక మాసంలో చీకటి పడిన తర్వాత కొంచెం చలి ప్రారంభమవుతుంది. కానీ, పగలు అటు ఎండ ఎక్కువగా లేకుండా, ఇటు మంచు పడకుండా ప్రకృతి ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. ఇటువంటి వాతావరణంలో వర్ష రహితంగా అందరూ కలిసి జరుపుకునే వన సమారాధనల వల్ల వ్యక్తులు, కుటుంబాల మధ్య సమైక్యత ఏర్పడుతుందన్నది నమ్మకం. ఆ విధంగా ఆధ్యాత్మికం, ఆరోగ్య శాస్త్రాల మేళవింపుగా మన పూర్వీకులు ఏర్పరచినవే వన సమారాధనలు (వనభోజనాలు).



పూజలు నిర్వహిస్తున్న శ్రీనివాసాచార్యస్వామి (ఫైల్)

ఉసిరి, తులసి మొక్కలకు పూజలు



వనభోజనాల సందర్భంగా కొన్ని ఆధ్యాత్మికపరమైన కార్యక్రమాలను నిర్దేశించారు. వనభోజనం ఉసిరి చెట్టు ఉన్న చోట చేయాలి. ఉసిరి చెట్టును విష్ణుమూర్తికి ప్రతిరూపంగా పురాణాల్లో పేర్కొన్నారు. శివుడికి ఎంతో ప్రీతికరమైన ఈకార్తీక మాసంలో ఉసిరి చెట్టు దగ్గర లక్ష్మీదేవి ప్రతిరూపమైన తులసి మొక్కను ఉంచి పూజించడం వల్ల సకల పాపాలు తొలగిపోయి, లక్ష్మీనారాయణ ఆశీస్సులతో సకల శుభాలు కలుగుతాయని ప్రతీతి. అందుకే అనేక మంది ఉసిరి చెట్టు లేకపోతే ఉసిరి కొమ్మను తీసుకు వచ్చి ఒకచోట గుచ్చి దానికి పూజ చేసి అనంతరం అక్కడ సామూహికంగా వనభోజనం చేస్తారు.

నేడు వనభోజనాలకు సర్వం సిద్ధం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో కులాల వారీగా ప్రజలు వనభోజనాలకు సర్వం సిద్ధమయ్యారు. ఆలయాలు, పార్కులు, చుట్టుపక్కల ఉన్న పండ్ల తోటలు, విశాలమైన ప్రదేశాల్లో ఆదివారం వనభోజనాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ప్రధానంగా త్రికోట పరిసరాలు, వనవిజ్ఞాన కేంద్రం, ఏకశిల చిల్డ్రన్స్ పార్కు, వరంగల్ కోటి లింగాల దేవాలయం, ఖిలావరంగల్ వాకర్స్ మైదానంలో పద్మశాలీలు, గౌడ, మున్నూరు కాపు, ఆర్యవైశ్య, ఇతర కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్దఎత్తున కార్యక్రమాలు ఏర్పాటు చేసుకున్నారు.



ఆటలు.. పాటలు..

కార్తీక వనభోజనాల్లో తమ తమ కమ్యూనిటీలో మంచిచెడులను చర్చించుకుంటారు. అందరూ కలిసి ఐక్యతను చాటేలా కార్యక్రమాలు నిర్వహిస్తారు. పెద్దలు, పిల్లలు వేర్వేరుగా ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. దీని వల్ల రోజువారీ పని ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుంది. ఆటలపోటీల్లో రాణించిన వారికి బహుమతులను అందజేయడం వల్ల వారికి ప్రోత్సాహకరంగా ఉంటుందని ఆర్యవైశ్య సంఘం ప్రతినిధి ఒకరు చెప్పారు.

సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని మేలుకొల్పుతాయి



కార్తీక సమారాధనలు సర్వమానవ సమానత్వాన్ని సౌభ్రాతృత్వాన్ని మేలుకొల్పుతాయి. ధాత్రినారాయణస్వామిని (ఉసిరిక చెట్టు), లక్ష్మి స్వరూపమైన (తులసి చెట్టు)ను ప్రతిష్ఠించి పూజలు చేయాలి. అక్కడ కార్తీక వనభోజనాలు చేయడం శ్రేయస్కరం. వస్త్ర, సాలగ్రామ, దీప దానాలు చేయడం ఉత్తమం.

– అరుట్ల శ్రీనివాసాచార్యస్వామి, ధర్మప్రవచకులు

ఐక్యత చాటేందుకే వనభోజనం



కమ్యూనిటీ వాళ్లు ఎక్కడెక్కడో ఉంటారు. కార్తీక మాసంలో నిర్వహించుకునే వనభోజనాల కార్యక్రమం ఆధ్యాత్మికత సంతరించడమేకాకుండా మనలో ఐక్యత చాటుతుంది. వనం వల్ల మానసిక ప్రశాంతత, పిల్లల్లో వ్యక్తిత్వ వికాసం పెంపొంది, వృద్ధులకు ఆధ్యాత్మిక అనుభూతి కలుగుతుంది.

– శామంతుల శ్రీనివాస్, పోపా రాష్ట్ర అధ్యక్షుడు

సరదాగా గడుపుతాం..



ఖిలా వరంగల్ ఏకశిల చిల్డ్రన్స్ పార్కులో గౌడ కుల బంధువులతో కలిసి నేడు (ఆదివారం) వనభోజనం ఏర్పాటు చేశాం. అందరం ఒకేచోట కలుసుకునే అరుదైన వేదిక ఇది. గౌడల ఆరాధ్య దేవుళ్లను పూజించుకుంటాం. వనసమారాధన చేస్తాం. పిల్లలు, పెద్దలు కలిసి సరదాగా గడుపుతాం.

– డాక్టర్ చిర్ర రాజుగౌడ్, గౌడ (గోపా) జిల్లా అధ్యక్షుడు

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద



మట్టెవాడ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్య శారద

వరంగల్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. వరంగల్‌లోని మట్టెవాడ, గిర్మాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల బాక్స్‌ను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం సరిగా వండడం లేదని వచ్చిన ఫిర్యాదును తెలుసుకుని అందుకు గల కారణాలను పరిశీలించాలని డీఈఓ జ్ఞానేశ్వర్‌ను ఆదేశించారు. పాఠశాలల పరిసరాలు శుభ్రంగా ఉండాలని హెచ్ఎంలను ఆదేశించారు. వాటర్ ట్యాంక్ లీకేజీ మరమ్మతుల కోసం ప్రతిపాదనలు సమర్పించి నీటి వృథాను అరికట్టాలని సూచించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆమె వెంట వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

గిర్మాజీపేట ప్రభుత్వ పాఠశాల పరిశీలన

కాశిబుగ్గ సెంటర్: వరంగల్ మండలం గిర్మాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శనివారం మధ్యాహ్నం డీఈఓ మామిడి జ్ఞానేశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంలో కూరలు రుచికరంగా లేవని, సరిపడా వడ్డించడం లేదని, అన్నంలో రాళ్లు వస్తున్నాయని, సగం మంది విద్యార్థులు ఇంటినుంచే భోజనం తెచ్చుకుంటున్నామని తెలిపారని పేర్కొన్నారు. విద్యార్థుల కోరిక మేరకు ప్రస్తుత ఏజెన్సీని తొలగించాలని పాఠశాల హెచ్ఎంను ఆదేశించినట్లు తెలిపారు. ఆయన వెంట ఏఎంఓ సుజన్‌తేజ, ఎంఈఈ గంప అశోక్‌కుమార్, హెచ్ఎం నాగమణి తదితరులు ఉన్నారు.

పోలీస్ అధికారులకు ప్రశంస పత్రాలు



ప్రశంసపత్రాలు అందుకుంటున్న పోలీస్ అధికారులు

వరంగల్ క్రైం : గంజాయి అరికట్టడంతోపాటు నేరస్తులకు జైలుశిక్ష పడడంలో కృషి చేసిన కేయూసీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సుబేదారి పోలీస్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సంగెం, మిల్స్ కాలనీ ఎస్సైలతోపాటు హెడ్ కానిస్టేబుల్ సుధాకర్ ప్రశంసపత్రాలు అందుకున్నారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డీజీపీ జితేందర్ వారికి ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారిని పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా అభినందించారు.

28నుంచి జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్, ఇన్‌స్పైర్

హనుమకొండ డీఈఓ డి.వాసంతి

విద్యారణ్యపురి : జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్, ఇన్‌స్పైర్ ప్రదర్శనలను ఈనెల 28వ తేదీనుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు హనుమకొండ డీఈఓ డి.వాసంతి, జిల్లా సైన్స్ అధికారి ఎస్.శ్రీనివాసస్వామి శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇన్‌స్పైర్ అవార్డులకు జిల్లా నుంచి 120 మంది విద్యార్థులు గతేడాది ఎంపికయ్యారని, వీరు తప్పనిసరిగా తమ ఎగ్జిబిట్లను ప్రదర్శించాల్సి ఉంటుందని తెలిపారు. హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని తేజస్వీ ఉన్నత పాఠశాలలో ఈ వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేశామని, ఇప్పటికే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయినందున ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. 28న మధ్యాహ్నం నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు హాజరై అక్కడే కేటాయించిన గదుల్లో విద్యార్థులు తమతమ ఎగ్జిబిట్స్‌ను అమర్చుకోవాలని తెలిపారు. 29న ఉదయం 9గంటలకు ఆయా విద్యార్థులు తమ గైడ్ టీచర్లతో హాజరు కావాల్సింటుందని, 30న మధ్యాహ్నం 3గంటలకు ముగింపు సమావేశంలో విజేతలకు బహుమతులు అందజేస్తామని వివరించారు. ఈ ఇన్‌స్పైర్, సైన్స్‌ఫెయిర్‌లో సుస్థిర భవిష్యత్ ఆరోగ్యం కోసం చిరు ధాన్యాలు 'మిల్లెట్స్ ఫర్ సస్టేయినబుల్ ఫ్యూచర్ అండ్ హెల్త్' అనే అంశంపై ఒక రోజు సెమినార్ ఉంటుందని పేర్కొన్నారు. బీఈడీ, డీఈడీ ఛాత్రోపాధ్యాయులు తయారు చేసిన బోధనోపకరణాలు ప్రదర్శన పోటీ కూడా ఉంటుందని వివరించారు.

తిలకించే మండలాల విద్యార్థులు..

ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిట్స్‌ను తిలకించేందుకు 29న హనుమకొండ, కాజీపేట, ఐనవోలు, హసన్‌పర్తి, దామెర, ధర్మసాగర్, ఆత్మకూరు, నడికుడ మండలాల విద్యార్థులకు అవకాశం కల్పిస్తారు. 30న మధ్యాహ్నం వరకు భీమదేవరపల్లి, శాయంపేట, కమలాపూర్ మండలాల విద్యార్థులు చూడనున్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

కాజీపేట : ప్రభుత్వ పాఠశాలలతో పాటు గురుకులాలు, కేజీబీవీలు, హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో విద్యార్థులకు అందించే భోజనంపై శనివారం ఆమె సమీక్ష నిర్వహించారు. అంతకు ముందు రాష్ట్రంలోని ఆయా జిల్లాల కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి భోజన ఏర్పాట్లపై సమీక్షిస్తూ దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో డీఆర్వో వై.వి గణేష్, బీసీ వెల్ఫేర్ డీడీ రాంరెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కొమురయ్య, సివిల్ సప్లయి మేనేజర్ మహేందర్ పలువురు అధికారులు పాల్గొన్నారు.

గురుకులాన్ని సందర్శించిన డీఎండబ్ల్యూఓ

న్యూశాయంపేట : వరంగల్ శంభునిపేట దూపకుంట రోడ్డులోని వరంగల్ (జీ-2) బాలికల మైనార్టీ గురుకుల కళాశాలను వరంగల్ జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి (డీఎండబ్ల్యూఓ) టి. రమేశ్ శనివారం సాయంత్రం తనిఖీ చేశారు. డార్మెటరీ, పరిసరాలను, కిచెన్‌ను పరిశీలించి విద్యార్థులకు అందజేస్తున్న భోజనం, బియ్యం నాణ్యతను పరిశీలించారు. మెనూ పాటిస్తున్నారా అని ప్రిన్సిపాల్ నీలిమాదేవిని అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు ఖిలావరంగల్ తహసీల్దార్ నాగేశ్వర్‌రావు సైతం గురుకులాన్ని తనిఖీ చేసి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఖిలావరంగల్ ఆర్‌ఐ ఆనంద్ కుమార్, మైనార్టీ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ విజయ పాల్‌రెడ్డి, డీటీఈఓ రాజు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులం ఆకస్మిక తనిఖీ

హసన్‌పర్తి : కేయూ క్రాస్ వద్ద నిర్వహిస్తున్న మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలను (భీమారం) జిల్లా పరిషత్ సీఈఓ విద్యాలత శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి ఆమె భోజనం చేశారు. ఏపీఓ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

గంటలో వ్యాపారి ఇల్లు గుల్ల!

- రూ.14లక్షల విలువ చేసే బంగారు నగలు అపహరించిన దొంగలు
- కాజీపేటలో ఘటన



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

కాజీపేట: భార్య ఆస్పత్రికి వెళ్లింది. భర్త.. పిల్లలను ట్యూషన్ నుంచి తీసుకొచ్చేందుకు ఇంటికి తాళం వేసి వెళ్లాడు. గంట వ్యవధిలోనే ఇల్లును దొంగలు లూటీ చేశారు. రూ.14లక్షల విలువ చేసే బంగారు నగలను అపహరించారు. శుక్రవారం రాత్రి కాజీపేట పట్టణంలో జరిగిన ఈ ఘటన కలకలం రేపింది. బాధితులు శనివారం కాజీపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీకి చెందిన దావ కిశోర్ వ్యాపారం నిర్వహిస్తుంటారు. శుక్రవారం సాయంత్రం తన భార్య ఆస్పత్రికి వెళ్లగా కిశోర్ ఇంటికి తాళం వేసి పిల్లలను ట్యూషన్ నుంచి తీసుకొచ్చేందుకు వెళ్లాడు. రాత్రి 8: 30గంటల సమయంలో కిశోర్ భార్య ఇంటికి రాగా తాళం పగులగొట్టి ఉండటం చూసి వెంటనే భర్తకు ఫోన్ చేసింది. ఆయన హుటాహుటిన ఇంటికి వచ్చాడు. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న 35 తులాల బంగారం నగలు కనిపించలేదు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు.

క్లూస్ కోసం అధికారుల ప్రయత్నాలు..

ఏసీపీ తిరుమల్‌తోపాటు, సీఐ సుధాకర్ రెడ్డి, టాస్క్‌ఫోర్స్ పోలీసులు, డాగ్ స్క్వాడ్ సిబ్బంది జాగిలాల సహాయంతో చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. క్లూస్‌టీం సిబ్బంది తాళంతోపాటు బీరువాపై ఉన్న వేలిముద్రలను సేకరించారు. కాలనీలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. దొంగలు ఢిల్లీ రిజిస్ట్రేషన్‌తో వాహనాన్ని ఉపయోగించినట్లు పోలీసులు గుర్తించారు. సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశం మేరకు ఎస్సై నవీన్‌కుమార్ తోపాటు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. గంట సేపటిలోనే తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ చేసి పరారవడం నగరంలో చర్చనీయాంశంగా మారింది.

కబ్జాలపై నివేదిక బుట్టదాఖలు

- నాలుగేళ్ల క్రితమే 357 ఎకరాలు కబ్జా అయినట్లు గుర్తింపు
- అయినా ఆగని ఎస్సారెస్పీ భూముల ఆక్రమణలు
- ఇప్పటికీ ఎన్‌ఓసీలు ఇస్తున్న వైనం
- తాజాగా ఐదుగురు కబ్జాదారులపై ఫిర్యాదు
- చర్యలు తీసుకుంటాం: సీతారాం నాయక్, ఈఈ



హసన్‌పర్తి: 'హసన్‌పర్తి పరిధిలోని ఎస్సారెస్పీ భూములు 357 ఎకరాల మేర కబ్జాకు గురయ్యాయి 'అని నాలుగేళ్ల క్రితమే అధికారులు జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. కానీ ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడం, కబ్జాలు ఆగకపోవడంతో ఆ నివేదికలు బుట్టదాఖలయ్యాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం ఇక్కడ ఎకరం రూ.కోటినుంచి రూ.4కోట్ల వరకు ధర పలుకుతోంది. ఇలా లెక్క వేసుకుంటే వేల కోట్ల రూపాయల విలువైన భూములు కబ్జాకు గురైనట్లు తెలుస్తోంది.

భూములకు డిమాండ్ పెరగడంతో...

ఎస్సారెస్పీ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా హసన్‌పర్తి అన్నాసాగరంనుంచి ఆరెపల్లి వరకు భూసేకరణ చేపట్టారు. కాల్వ ఇరువైపులా సుమారు 4,239 ఎకరాల స్థలాన్ని వివిధ అవసరాల కోసం వదిలిపెట్టారు. ఈ భూములకు డిమాండ్ పెరగడంతో అక్రమార్కుల కన్ను పడింది. సేకరించిన భూముల వివరాలురెవెన్యూ రికార్డుల్లో నమోదు కాలేదు. సదరు పట్టాదారులకు నయానో భయానో ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఏకంగా గ్రామపంచాయతీ అనుమతులు పొంది ఇళ్ల నిర్మాణాలు కూడా చేపట్టారు. కొందరు అక్రమార్కులు చుట్టూ కంచె నాటారు.

క్వారీలు.. ఫంక్షన్ హాల్ నిర్వాహకులు కూడా..

ఈ ప్రాంత మార్గమధ్యలోని క్వారీలు, ఫంక్షన్ హాల్‌ల నిర్వాహకులు కూడా ఎస్సారెస్పీ భూములను కలుపుకున్నట్లు 2011లో చేపట్టిన సర్వేలో వెల్లడైంది. భూములు కాపాడేందుకు అప్పటి ఉమ్మడి జిల్లా జాయింట్ కలెక్టర్ వాకాటి కరుణ ప్రత్యేక చొరవ చూపారు. సర్వేలో గుర్తించిన అక్రమ కట్టడాలను కూల్చివేశారు. భూముల పరిరక్షణకు వీటిని మహిళా సంఘాలకు కేటాయించారు. వారు ఈ భూముల్లో కూరగాయల సాగు చేపట్టారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద సుమారు రూ.20కోట్లు ఖర్చు చేశారు. ఈ నిధులతో భూముల చదునుతోపాటు బోర్లు కూడా వేశారు. కొంతకాలం మహిళలు సాగు చేశారు. ఆ తర్వాత బంద్ చేయడంతో ఆ భూములు బీడుగా మారాయి. కూరగాయల తోటలకు ఖర్చు చేసిన డబ్బులు సైతం వృథా అయ్యాయి.

నాలుగేళ్ల క్రితం నివేదిక అందజేత..

భారీ, మధ్య తరహా నీటి పారుదలశాఖలు ఒకే గొడుగు కిందికి రాకముందు ఎస్సారెస్పీ అధికారులు భూముల సమగ్ర సర్వే చేపట్టారు. ఇందులో 357 ఎకరాల భూమి కబ్జాకు గురైనట్లు నిర్ధారించారు. నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేశారు. భూములు కబ్జాకు గురి కాకుండా ఉండేందుకు కంచె ఏర్పాటు చేయాలని నివేదికలో పేర్కొన్నారు. అయినా ఎటువంటి చర్యలు తీసుకోకపోగా, ఈ భూముల్లోని నిర్మాణాలకు ఇప్పటికీ (నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ)లు జారీ చేస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సదరు అక్రమార్కుల నుంచి డబ్బులు తీసుకుని ఎన్‌ఓసీ ఇస్తున్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. భీమారం శివారులోని మంత్రపురికాలనీలో సుమారు ఇరవై ఎకరాల ఎస్సారెస్పీ భూమిని ఆశాఖలో పనిచేసిన ఉద్యోగి కబ్జా చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. తాజాగా ఐదుగురు కబ్జాదారులపై కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

కబ్జా చేస్తే చర్యలు తప్పవు

ఎస్సారెస్పీ భూములు కబ్జా చేస్తే చర్యలు తప్పవు. భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తాం.

– సీతారాంనాయక్, ఈఈ

రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

- మజ్దూర్‌ యూనియన్‌ డివిజన్‌ సెక్రటరీ రవీందర్‌



మాట్లాడుతున్న మజ్దూర్‌ యూనియన్‌ డివిజన్‌ సెక్రటరీ రవీందర్‌

కాజీపేట రూరల్‌: రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయమని మజ్దూర్‌ యూనియన్‌ సికింద్రాబాద్‌ డివిజన్‌ సెక్రటరీ పి.రవీందర్‌ అన్నారు. శనివారం కాజీపేట రైల్వే డీజిల్‌ లోకోషెడ్‌ గేట్‌ ఎదుట యూనియన్‌ డీజిల్‌ బ్రాంచ్‌ అధ్యక్షుడు ఎస్‌కె. జానీ ఆధ్వర్యంలో గేట్‌ మీటింగ్‌ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రవీందర్‌ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ డిసెంబర్‌ 4, 5వ తేదీల్లో జరిగే వన్‌ యూనియన్‌ వన్‌ ఇండస్ట్రీయల్‌ ఎన్నికల్లో జెండా గుర్తును భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో డీజిల్‌ బ్రాంచ్‌ సెక్రటరీ పి.వేదప్రకాశ్‌, ట్రెజరర్‌ జి.రాజేశ్వర్‌రావు, అసిస్టెంట్‌ సెక్రటరీ యాదగిరి, నరేశ్‌యాదవ్‌, వైస్‌ చైర్మన్‌ భాస్కర్‌రెడ్డి, తిరుపతి, గుర్రం నాగరాజు, దువ్వ వెంకట్‌, అశోక్‌, ఎన్‌.రాజు, తదితరులు పాల్గొన్నారు.

అంతర్‌ కళాశాలల బాక్సింగ్‌ పోటీలు

కేయూ క్యాంపస్‌ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని అంతర్‌ కళాశాలల బాక్సింగ్‌ పోటీలు శనివారం (పురుషులు, మహిళలు) హనుమకొండలోని జేఎన్‌ఎస్‌లో నిర్వహించారు. ఈ పోటీలను కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ వై. వెంకయ్య ప్రారంభించారు. ఫిజికల్‌ డైరెక్టర్లు సునీల్‌రెడ్డి, అంబాల రాజేశ్‌, రమేశ్‌ పాల్గొన్నారు. ఈ పోటీల్లో వివిధ విభాగాల్లో 27 మంది పురుషులు, 25 మంది మహిళలు ప్రతిభ చాటారు. విజేతలను సౌత్‌జోన్‌ ఇంటర్‌ యూనివర్సిటీ పోటీలకు ఎంపిక చేసినట్లు వెంకయ్య తెలిపారు.

పరీక్షలు సాగేనా..ఆగేనా?

విడుదలకాని రీయింబర్స్‌మెంట్‌ బకాయిలు

- ఈనెల 26 నుంచి డిగ్రీ పరీక్షలు
- వాయిదా వేయాల్సిందేనని ప్రైవేట్‌ యాజమాన్యాల డిమాండ్‌
- నిర్వహిస్తామంటున్న అధికారులు
- డిగ్రీ కళాశాలల విద్యార్థుల్లో అయోమయం

కేయూ క్యాంపస్‌ : కాకతీయ యూనివర్సిటీ పరిధి ఉమ్మడి వరంగల్‌, ఖమ్మం, ఆదిలాబాద్‌ జిల్లాల ప్రైవేట్‌ డిగ్రీ, పీజీ కళాశాలలకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ బకాయిలు విడుదల చేయడం లేదని ఈనెల 19 నుంచి యాజమాన్యాలు నిరవధిక బంద్‌ను కొనసాగిస్తున్నాయి. ఆయా యాజమాన్యాల అసోసియేషన్‌ బాధ్యులు కేయూ వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డికి నిరవధిక బంద్‌ చేస్తున్నామని నోటీసు కూడా ఇచ్చిన విషయం విదితమే. రెండేళ్ల నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ విడుదల చేయకపోవడంతో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 90శాతం కళాశాలలు నాలుగైదు నెలలుగా అధ్యాపకులకు, ఇతర సిబ్బందికి వేతనాలు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. గత నెల 14వ తేదీనుంచి కూడా కళాశాలలు బంద్‌ చేయగా 17న విద్యాశాఖ సెక్రటరీ ఆయా యాజమాన్యాల అసోసియేషన్‌ బాధ్యులతో మాట్లాడారు. వారం రోజుల్లో విడుదల చేస్తామని చెప్పి చెల్లించకపోవడంతో మళ్లీ ఈనెల19నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కళాశాలలు కూడా బంద్‌ను పాటిస్తున్నాయి.

214 ప్రైవేట్‌ డిగ్రీ కళాశాలలు

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ప్రస్తుతం 214 ప్రైవేట్‌ డిగ్రీ, 41 పీజీ కళాశాలలున్నాయి. 52 కళాశాలల్లో ఈ ఏడాది అసలు విద్యార్థులే చేరలేదు. మొదటి సంవత్సరంలో 46,169 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వ నుంచి రెండేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌ రావడం లేదు. ఆయా కళాశాలలకు చెల్లించాల్సిన బకాయిలు సుమారు రూ.162 కోట్ల వరకు ఉంటుందని సమాచారం.



వీసీకి నోటీసు అందజేస్తున్న ప్రైవేట్‌ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు (ఫైల్‌)

ఫీజుల చెల్లింపులో జాప్యం

కేయూ పరిధిలోని ప్రైవేట్‌ డిగ్రీ, పీజీ కళాశాలలు ప్రతి విద్యాసంవత్సరం స్టూడెంట్‌ రికగ్నైషన్‌ ఫీజు, ప్రాసెసింగ్‌, స్టూడెంట్‌ వెల్ఫేర్‌ ఫండ్‌, స్పోర్ట్స్‌ ఫీజు యాజమాన్యాలు చెల్లించాల్సింటుంది. ఈ విద్యా సంవత్సరంలో 2024–25 చెల్లించాల్సిన ఫీజులు చెల్లించేందుకు జాప్యం చేస్తున్న పరిస్థితి ఉంది. ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా ఆ ఫీజులతో పాటు డిగ్రీ సెమిస్టర్ల పరీక్ష ఫీజులను కూడా మినహాయించి పరీక్షలు నిర్వహించాలని ఇటీవల ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు వీసీని, రిజిస్ట్రార్‌ మల్లారెడ్డిని కలిసి విన్నవించాయి. ప్రతి ఏడాది కేయూకు విద్యార్థుల సంఖ్యను బట్టి రూ.12 నుంచి రూ.13 కోట్లవరకు ఫీజుల రూపేణ వస్తుందని తెలుస్తోంది. పరీక్ష ఫీజులు మాత్రం ఎక్కువశాతం కళాశాలలు చెల్లించాయి.

డిగ్రీ మొదటి, మూడో, ఐదో సెమిస్టర్‌ పరీక్షలు జరిగేనా?

కేయూ పరిధిలో డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీసీఏ, బీఎస్సీ కోర్సుల మొదటి, మూడో, ఐదో సెమిస్టర్‌ పరీక్షలు ఈనెల 26నుంచి నిర్వహించేందుకు పరీక్షల విభాగం అధికారులు ఇప్పటికే టైం టేబుల్‌ విడుదల చేశారు. ఈ నెల 21న పరీక్ష కేంద్రాల జాబితాను విడుదల చేశారు. అయితే ఈపరీక్షలు జరిగేనా అనే అంశంపై అనుమానాలున్నాయి. నిరవధిక బంద్‌ నేపథ్యంలో ప్రైవేట్‌ డిగ్రీ కళాశాలల్లోనూ పరీక్ష కేంద్రాలున్నాయి. అందువల్ల వారు సహకరించకపోతే ఆయా పరీక్షలు జరిగే అవకాశం లేదు. తమకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ విడుదల అయ్యేవరకు పరీక్షలు బహిష్కరిస్తున్నట్లు ప్రకటించాయి. అంతేగాకుండా వివిధ కళాశాలల్లో ప్రాక్టికల్స్‌ పరీక్షలు సైతం నిర్వహించడం లేదు. టైంటేబుల్‌ ప్రకారం పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఎస్‌.నర్సింహాచారి చెబుతున్నారు.

మంత్రి భట్టి విక్రమార్కతో చర్చలు

రాష్ట్రంలోని డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు బంద్‌ పాటించడంతో ఇటీవల ఆర్థిక శాఖమంత్రి భట్టి విక్రమార్కతో హైదరాబాద్‌లో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్‌ బాలకృష్టారెడ్డి సమక్షంలో ప్రైవేట్‌ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్‌ బాధ్యులు చర్చించినట్లు సమాచారం. 15రోజుల్లో నాన్‌ ప్రొఫెషనల్‌ కోర్సులకు సంబంధించి కొంత ఫీజు రీయింబర్స్‌మెంట్‌ బకాయిలు చెల్లిస్తామని, కళాశాలలను తెరవాలని మంత్రి అసోసియేషన్‌ బాధ్యులను కోరారు. ఇప్పటికే ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో వివిధ సెమిస్టర్ల పరీక్షలు జరుగుతుండగా మహాత్మాగాంధీ యూనివర్సిటీ మాత్రం డిగ్రీ మొదటి, మూడో, ఐదో సెమిస్టర్‌ పరీక్షలు వాయిదా వేశారని సమాచారం. అయితే కేయూ పరిధిలో ఈనెల 26న నిర్వహిస్తామని పరీక్షల విభాగం అధికారులు చెబుతున్నప్పటికీ ప్రైవేట్‌ కళాశాలల యాజమాన్యాలు మాత్రం వాయిదా వేయాల్సిందేనని అంటున్నాయి. దీంతో ఆయా పరీక్షలు జరుగుతాయా..లేదా? అని విద్యార్థులు అయోమయంలో ఉన్నారు. పరీక్షలు నిర్వహణ కూడా సాధ్యంకాదని, అందుకే డిగ్రీ సెమిస్టర్ల పరీక్షలు వాయిదా వేయక తప్పదనే అంశం ప్రచారంలో ఉంది.

26న సబ్‌జూనియర్స్‌ అథ్లెటిక్స్‌ ఎంపిక పోటీలు

వరంగల్‌ స్పోర్ట్స్‌: హనుమకొండలోని జవహర్‌లాల్‌ నెహ్రూ స్టేడియంలో వరంగల్‌ జిల్లాస్థాయి సబ్‌ జూనియర్స్‌ అథ్లెటిక్స్‌ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ వరంగల్‌ జిల్లా సెక్రటరీ ఊర యుగేంధర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్‌–8, 10, 12 బాలబాలికల విభాగాల్లో ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. అండర్‌–8 కేటగిరీలో బాలబాలికలకు 50 మీటర్ల పరుగు, 300 మీటర్ల పరుగు, కిడ్స్‌ జావెలిన్‌త్రో, అండర్‌–10 విభాగంలో బాలబాలికలకు 100 మీటర్ల పరుగు, 300 మీటర్ల పరుగు, లాంగ్‌ జంప్‌, కిడ్స్‌ జావెలిన్‌ త్రో, అండర్‌–12 విభాగంలో బాలబాలికలకు 100 మీటర్ల రన్నింగ్‌, 400 మీటర్ల రన్నింగ్‌, 600 మీటర్ల రన్నింగ్‌, లాంగ్‌జంప్‌, జావెలిన్‌త్రో ఈవెంట్లలో పోటీలు ఉంటాయని తెలిపారు. అండర్‌–8 విభాగంలో పాల్గొనే క్రీడాకారులు 2 డిసెంబర్‌ 2016 నుంచి 1 డిసెంబర్‌ 2018 మధ్య జన్మించిన వారు, అండర్‌–10 విభాగంలో 2 డిసెంబర్‌ 2014 నుంచి 1 డిసెంబర్‌ 2016 మధ్య జన్మించిన వారు, అండర్‌–12 కేటగిరీలో పాల్గొనే క్రీడాకారులు 1 డిసెంబర్‌ 2012 నుంచి 1 డిసెంబర్‌ 2014 మధ్య జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు వెంట తీసుకునిరావాలని కోరారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను డిసెంబర్‌ 1వ తేదీన మంచిర్యాలలో జరగనున్న 10వ తెలంగాణ రాష్ట్ర సబ్‌జూనియర్స్‌ అథ్లెటిక్స్‌ చాంపియన్‌షిప్‌ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. క్రీడాకారుల తమ పేర్లు రిజిస్ట్రేషన్‌, ఇతర వివరాల కోసం యుగేంధర్‌రెడ్డి మొబైల్‌ నంబర్‌ 98665 64422, పి.మహేందర్‌ 96188 28299 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

భద్రకాళి ఆలయంలో దీపోత్సవం



హన్మకొండ కల్చరల్‌ : భద్రకాళి ఆలయంలో కార్తీక దీపోత్సవంలో భాగంగా శనివారం ఆలయ ఈఓ శేషుభారతి పర్యవేక్షణలో మహిళా భక్తులు ఆకాశ దీపాన్ని వెలిగించి సామూహిక దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ఉచితంగా మట్టి ప్రమిదలు, వత్తులు, నూనె, పసుపు, కంకుమలు, అక్షింతలు, గాజులను ఆలయ ఈఓ అందజేశారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పంచారామాలకు సూపర్‌ లగ్జరీ బస్సు



కాజీపేట అర్బన్‌ : కార్తీక మాసం సందర్భంగా శైవక్షేత్రాలను సందర్శించే భక్తుల సౌకర్యార్థం పంచారామ దర్శన యాత్రకు సూపర్‌ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు టీజీఎస్‌ ఆర్టీసీ వరంగల్‌ రీజినల్‌ మేనేజర్‌ డి.విజయభాను శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీలోని పంచారామ క్షేత్రాలు అమరావతిలోని అమర లింగేశ్వరస్వామి, భీమవరంలోని సోమేశ్వర స్వామి, పాలకొల్లులోని క్షీర లింగేశ్వరస్వామి, ద్రాక్షారామంలోని భీమేశ్వరస్వామి, సామర్లకోటలోని భీమేశ్వరస్వామి దేవాలయాలను దర్శించుకునేందుకు ఈనెల 27వ తేదీన లగ్జరీ బస్సు సర్వీసు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈనెల 27వ తేదీన సాయంత్రం 6 గంటలకు హనుమకొండ బస్సు స్టేషన్‌ నుంచి బయలుదేరి గురువారం పంచరామ దర్శనం అనంతరం శుక్రవారం ఉదయం తిరిగి హనుమకొండ బస్సు స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. పంచారామ దర్శనానికి పెద్దలకు రూ. 2300, పిల్లలకు రూ. 1400 చార్జీ ఉంటుందని, బుకింగ్‌ కోసం సర్వీస్‌ నంబర్‌ 94444 ద్వారా ఆన్‌లైన్‌లో tgsrtconline.in, వివరాలకు 7382855492, 9959226056, 9959 226047 నంబర్లలో సంప్రదించాలని ఆర్టీసీ వరంగల్‌ రీజినల్‌ మేనేజర్‌ డి.విజయభాను తెలిపారు.

కబడ్డీ జిల్లా మహిళా జట్టు ఎంపిక పోటీలు

కాశిబుగ్గ: కబడ్డీ సీనియర్స్‌ వరంగల్‌ జిల్లా మహిళా జట్టు ఎంపిక పోటీలు శనివారం ఓసిటీ స్టేడియంలో శనివారం నిర్వహించారు. జిల్లాలోని 13 మండలాల నుంచి హాజరైన 75 మంది క్రీడాకారులకు పోటీలు నిర్వహించి 16 మందిని ఎంపిక చేశామని కబడ్డీ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి తెలిపారు. సోమవారం నుంచి రంగశాయిపేటలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వారిలో 12 మందిని ఎంపిక చేసి డిసెంబర్‌ 7 నుంచి 10 వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలకు జిల్లా జట్టుగా పంపించనున్నట్లు వివరించారు. కబడ్డీ అసోసియేషన్‌ జిల్లా కార్యదర్శి, కబడ్డీ అసోసియేషన్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహమ్మద్‌ అబ్దుల్లా ఖాన్‌, డీవైఎస్‌ఓ సత్యవాణి, అసోసియేషన్‌ చైర్మన్‌ పుల్లూరు శ్రీనివాస్‌గౌడ్‌, సంయుక్త కార్యదర్శి మల్లికార్జున్‌గౌడ్‌, అక్తర్‌పాషా, ముఖర్జీ, 13 మండలాల కబడ్డీ అసోసియేషన్‌ సభ్యులు, పీఈటీలు, కోచ్‌లు పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో కబడ్డీ అసోసియేషన్‌ వరంగల్‌ జిల్లా బాధ్యులు

గాయంతో పతకం కోల్పోయా..

- అంతర్జాతీయ క్రీడాకారిణి అరుణ
- ఈశా ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో గ్రామీణ ఆటల ఉత్సవం



నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న ఐఎంఏ వరంగల్‌ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి

వరంగల్‌ స్పోర్ట్స్‌: వరుసగా ఐదు పర్యాయాలు ప్రపంచ స్థాయి జిమ్నాస్టిక్స్‌ పోటీల్లో పాల్గొన్నా.. ప్రతిసారి కాలుకు గాయం కావడంతో పతకాలు సాధించలేకపోయానని అంతర్జాతీయ క్రీడాకారిణి అరుణ బుద్దారెడ్డి అన్నారు. ఈశా ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్‌లాల్‌ నెహ్రూ స్టేడియంలో శనివారం గ్రామీణ ఆటల ఉత్సవం నిర్వహించారు. పురుషులకు వాలీబాల్‌, మహిళలకు త్రోబాల్‌ క్రీడల్లో నిర్వహించిన పోటీలకు అరుణ బుద్దారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. 2018లో మెల్‌బోర్న్‌లో జరిగిన ప్రపంచ జిమ్నాస్టిక్స్‌ చాంపియన్‌షిప్‌లో భారత్‌ నుంచి పాల్గొని టేబుల్‌ వాక్‌ ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించడం గర్వంగా ఉందన్నారు. 2019 నుంచి 2023 వరకు వివిధ దేశాల్లో జరిగిన వరల్డ్‌ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న ప్రతీసారి కాలుకు తీవ్రగాయం కావడంతో లక్ష్యం చేరుకోలేకపోయానన్నారు. ఈశా ఫౌండేషన్‌ వలంటీర్‌ శిరీష మాట్లాడుతూ ఈ పోటీల్లో ఉమ్మడి వరంగల్‌ జిల్లా నుంచి 22 వాలీబాల్‌ జట్లు, 12 త్రోబాల్‌ జట్లు పాల్గొన్నాయన్నారు. వాలీబాల్‌లో పడిగాపూర్‌ గెలుపొందగా రన్నరప్‌గా నీరుకుళ్ల నిలిచిందని తెలిపారు. త్రోబాల్‌లో కమలాపూర్‌ గెలుపొందగా, రన్నరప్‌గా శాయంపేట నిలిచిందన్నారు. డిసెంబర్‌ 28న సద్గురు సమక్షంలో కోయంబత్తూర్‌ లోని ఆదియోగి స్టేడియంలో ఫైనల్‌ జరుగుతుందని తెలిపారు. ముగింపు వేడుకలకు ఐఎంఏ వరంగల్‌ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి హాజరై వాలీబాల్‌ పోటీల్లో గెలుపొందిన జట్టుకు రూ. పదివేల నగదు ప్రోత్సాహకం అందజేశారు. కార్యక్రమంలో ఈశా ఫౌండేషన వలంటీర్లు వేణుగోపాల్‌, రమాకాంత్‌, సింధు, తెలంగాణ వాలీబాల్‌ అసోసియేషన్‌ రాష్ట్ర క్యావర్గ సభ్యుడు శ్రీధర్‌, అసోసియేషన్‌ జనగామ జిల్లా అధ్యక్షుడు యాదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రికెట్‌ పోటీలు



పోటీలో తలపడుతున్న జట్లు

కేయూక్యాంపస్‌ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని కాలేజీయెట్‌ క్రికెట్‌ (పురుషుల) (ఉమ్మడి వరంగల్‌జిల్లా) పోటీలు రెండో రోజు శనివారం కేయూ క్రీడామైదానంలో కొనసాగాయి. ఈనెల 24న జరిగే సెమీ ఫైనల్స్‌లో వరంగల్‌ కిట్స్‌ కాలేజీ, యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్‌ సైన్స్‌ కాలేజీ జట్లు తలపడబోతున్నాయి. కాగా, హనుమకొండ వాగ్దేవి కాలేజీ జట్టు ఫైనల్‌కు చేరుకుందని నిర్వాహకులు తెలిపారు. టోర్నమెంట్‌లో ఆర్ట్స్‌అండ్‌ సైన్స్‌కాలేజీ ఫిజికల్‌ డైరెక్టర్‌ పి. భాస్కర్‌, వరంగల్‌ జిల్లా క్రికెట్‌ సంఘం మాజీ కార్యదర్శి మారినేని ఉదయ్‌భానురావు, పీడీలు మహ్మద్‌ అఫ్జల్‌, మట్టెడకుమార్‌, అస్లాం, మధుకర్‌ , పల్లెపు కిషన్‌, బత్తిని జీవన్‌, మోహన్‌కృష్ణ,రాము, ప్రభాకర్‌, ఎం. శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. కేయూ స్పోర్ట్స్‌ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్‌ వెంకయ్య పర్యవేక్షించారు.

12 గంటల నిర్విరామ హ్యాక్‌థాన్‌



హ్యాకథాన్‌లో పాల్గొన్న ప్రొఫెసర్లు

హసన్‌పర్తి : హసన్‌పర్తి మండలం అన్నాసాగరం శివారులోని ఎస్సార్‌ యూనివర్సిటీలో 12 గంటల పాటు హ్యాక్‌థాన్‌ నిర్వహించారు. శుక్రవారం రాత్రి ఎనిమిది గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం శనివారం ఉదయం 8 గంటల వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్‌ డాక్టర్‌ ఇంద్రజిత్‌ గుప్తా మాట్లాడారు. విద్యార్థులను సాంకేతిక నిపుణులుగా తీర్చిదిద్దడానికి హ్యాక్‌థాన్‌ ఎంతో దోహదపడుతోందన్నారు. సీ ప్రోగ్రామింగ్‌పై మరింత శ్రద్ధ పెంపొందిస్తుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో సీఎస్‌ఈ విభాగాధిపతి డాక్టర్‌ శశికళ, డాక్టర్‌ సురేశ్‌, సబ్జెక్ట్‌ కోఆర్డినేటర్‌ విజయ్‌కుమార్‌, డాక్టర్‌ మీనాక్షిషా, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కాడెద్దుకు కన్నీటి వీడ్కోలు..



ఎద్దుకు అంత్యక్రియలు చేస్తున్న రైతు దంపతులు

కేసముద్రం: ఎడ్లజతే ఆ రైతుకు జీవనాధారం. ట్రాక్టర్లతో పొలం దున్నిస్తున్న ఈ కాలంలో ఆ జత ఎడ్లతో ఐదు ఎకరాలు సాగు చేశాడు. అందులో ఓ ఎద్దు చనిపోగా, కుటుంబ సభ్యుల మాదిరి దానికి అంత్యక్రియలు నిర్వహించి కన్నీటి వీడ్కోలు పలికాడు. ఈ ఘటన మహబూబాబాద్‌ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. అనుగుల నర్సయ్య, నిర్మల రైతు దంపతులకు రెండు కాడెడ్లు ఉన్నాయి. తమకున్న రెండెకరాల్లో వరి పంట వేయగా, 3 ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నారు. శనివారం ఆ భూమిలో మొక్కజొన్న సాగు చేసేందుకు కాడెడ్లతో దున్ని విత్తనాలు వేశారు. మధ్యాహ్న సమయంలో కాడెడ్లను వ్యవసాయబావి సమీపంలోని గడ్డివాము వద్ద ఉన్న చెట్టుకు కట్టేశారు. అందులో ఓ ఎద్దు తాడు తెంపుకుని పచ్చిగడ్డి మేస్తూ బావివద్దకు వెళ్లి జారి అందులో పడింది. మెడకు ఉన్న తాడు బిగుసుకుని మృత్యువాతపడింది. కొద్దిసేపటి తరువాత రైతు దంపతులు అక్కడికి రాగా, అప్పటికే బావిలో పడి మృత్యువాత పడిన దృశ్యం చూసి బోరున విలపించారు. నాలుగేళ్లుగా సాకుతున్న ఎద్దు చనిపోవడంతో మనిషి మాదిరి అంత్యక్రియలు (ఖననం) జరిపి కన్నీటి వీడ్కోలు పలికారు.

పెండింగ్‌ ఫైళ్లను క్లియర్‌ చేయాలి



డీఈఓ జ్ఞానేశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీపీటీఎఫ్‌ నాయకులు

కాశిబుగ్గ సెంటర్‌: జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని పెండింగ్‌ ఫైళ్లను క్లియర్‌ చేయాలని టీపీటీఎఫ్‌ బాధ్యులు కోరారు. ఈ మేరకు శనివారం సాయంత్రం వారు డీఈఓ జ్ఞానేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని డీఈఓకు పరిచయం చేసి టీపీటీఎఫ్‌ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్‌ మాట్లాడారు. పార్లమెంట్‌ ఎన్నికల్లో విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులకు ఈఎల్స్‌ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఉటుకూరి అశోక్‌, ప్రధాన కార్యదర్శి వీరస్వామి, ఉపాధ్యక్షుడు ముజాహిద్‌ అలీ, కార్యదర్శి ప్రసాద్‌ మునుపాటి, వెంటకటేశ్వర్లు, రాజేశ్‌ తదితరులు పాల్గొన్నారు.